
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 28.5
కనిష్ఠం 22.0
ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి
5
మంగళవారం 19 ఆగస్టు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.90 (300.0315)	3,05,553	2,93,982
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.04)	15,643	15,643
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	169.519 (37.6826)	2,55,688	3,10,060

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230



కొత్త వారికీ రేషన్

వర్షాకాలంతో పాటు ప్రకృతి విపత్తుల దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రేషన్ బియ్యాన్ని (ఆహారభద్రతా కార్డులకు) ప్రభుత్వం ముందే పంపిణీ చేసింది. జూన్, జూలై, ఆగస్టు నెలకు సంబంధించిన బియ్యాన్ని జూన్‌లోనే పంపిణీ చేసింది. సెప్టెంబరు నుంచి ప్రతీ నెల రేషన్ బియ్యం పంపిణీకి అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇటీవల కొత్తగా మంజూరైన రేషన్‌కార్డు లబ్ధిదారులకు సెప్టెంబరు నుంచి రేషన్ బియ్యం అందనున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

- నూతనంగా 24,431 రేషన్‌కార్డుల జారీ
- ప్రస్తుతం 1,02,805 యూనిట్లు
- 4,836.367మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ
- ఇక నుంచి పర్యావరణహిత సంచులు

ప్రజాపంపిణీ వ్యవస్థలో తమదైన ముద్రవేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. అందులో భాగంగా సెప్టెంబరు నుంచి చౌకధరల దుకాణాల్లో సన్న బియ్యం తీసుకెళ్లే లబ్ధిదారులకు పర్యావరణహిత సంచులు ఉచితంగా అందించేందుకు నిర్ణయించింది. ప్రభుత్వం జూన్‌లో మూడు నెలల రేషన్‌బియ్యాన్ని లబ్ధిదారులకు ఒకేసారి పంపిణీ చేసింది. ఈ మూడు నెలల వ్యవధిలో ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు జారీ చేయడంతో పాటు కార్డుల్లో కొత్త సభ్యుల పేర్లను చేర్చారు.

ప్రతీ నెల 4,836.367మెట్రిక్ టన్నుల సన్నబియ్యం

జిల్లాలో మొత్తం 17 మండలాలు, 428 గ్రామపంచాయతీలు, ఆరు మునిసిపాలిటీలు ఉండగా, ఇప్పటి వరకు 515 రేషన్ దుకాణాలు, 2,18,903 రేషన్‌కార్డులు ఉన్నాయి. వచ్చే మూడు నెలలు బియ్యం పంపిణీకి అధికారులు 13,517.796మెట్రిక్ టన్నుల బియ్యానికి ఇండెంట్ పెట్టారు. నూతనంగా కార్డులు జారీ చేయడంతో వాటి సంఖ్య మొత్తం రేషన్‌కార్డుల సంఖ్య 2,41,262కు చేరింది. 24,431 నూతన రేషన్‌కార్డులను అధికారులు జారీచేయడంతో పాటు నూతనంగా సభ్యులను కూడా చేర్చారు. గతంలో రేషన్ కార్డుల్లో 7,62,572 యూనిట్లు ఉండగా, ప్రస్తుతం 1,02,805యూనిట్లకు చేరింది. గతంలో 4,215.16మెట్రిక్‌టన్నుల వరకు బియ్యం పంపిణీ చేయగా, తాజాగా కొత్త కార్డులు జారీ చేయడం, పెరిగిన కుటుంబ సభ్యుల సంఖ్యకు అనుగుణంగా సన్న బియ్యం పంపిణీ చేయాలి ఉంది. దీంతో ప్రతీ నెల 4,836.367 మెట్రిక్‌టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు అన్ని రేషన్‌దుకాణాలకు బియ్యాన్ని అలాట్ చేశారు. లబ్ధిదారులందరికీ సన్నబియ్యాన్ని పంపిణీ చేయనున్నారు.

అదనంగా 621.207మెట్రిక్‌టన్నులు

ప్రస్తుతం రేషన్‌దుకాణాలు, మండల స్థాయి గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యానికి తోడు అదనంగా కావాల్సిన బియ్యం సరఫరా జరుగుతోంది. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన కోటాకు సంబంధించి డైనమిక్ కీరిజిస్టర్ విడుదల చేస్తారు. జనవరి నుంచి కొత్త కార్డులు, సభ్యుల చేర్పులు ప్రారంభం కాగా, జూన్ నెల తదుపరి కొత్త కార్డులు తీసుకున్నవారు, యూనిట్లలో లబ్ధిదారులు మూడు నెలల బియ్యాన్ని పొందలేకపోయారు. ఈ వ్యవధిలో పెరిగిన కార్డులకు అనుగుణంగా బియ్యం కోటాను పెంచనున్నారు. కొత్త కార్డుల పంపిణీకి ముందుకు ప్రతీనెల 4,215.16 మెట్రిక్‌టన్నుల బియ్యాన్ని రేషన్ దుకాణాలకు సరఫరా చేశారు. పెరిగిన లబ్ధిదారులకు అనుగుణంగా అదనంగా 621.207 మెట్రిక్ టన్నుల వరకు కోటా కేటాయించనున్నారు.

పర్యావరణహిత బ్యాగులు

సెప్టెంబరు నుంచి రేషన్‌దుకాణాల్లో సన్న బియ్యం తీసుకెళ్లే లబ్ధిదారులకు పర్యావరణహిత..

మిగతా 8వ పేజీలో...

పక్షం రోజుల్లో తలకిందులు

- 15 రోజుల క్రితం వరకు అనావృష్టి, ప్రస్తుతం అతివృష్టి
- వరుస వర్షాలతో జాలువారుతున్న పత్తి, కంది
- పత్తి చేలకు పొంచి ఉన్న జాజు రోగం ముప్పు
- ఆందోళన చెందుతున్న రైతులు





మోత్కూరుకు చెందిన దబ్బెటి శ్రీనుకు 10 ఎకరాల భూమి ఉంది. దీనికి తోడు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని మొత్తం 25 ఎకరాల్లో పత్తి సాగుచేశాడు. పత్తి విత్తనాలు విత్తినప్పుడు సరైన వర్షాలు లేక మూడు పర్యాయాలు విత్తాడు. ఆ తర్వాత కూడా వర్షాలు లేక పత్తి మొక్కలు ఎదగలేదు. పత్తి పూత, పిందె దశలో ఉంది. వారం, పది రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలకు పత్తి చేను పూర్తిగా జాలువారింది. భారీ వర్షాలకు పత్తి మొక్కలు నేలనుకర్రుకుంటున్నాయి. ఈ వర్షాలకు చేనంతా కుళ్లిపోయినట్టుగా మారింది. అతివృష్టితో దెబ్బతిన్న పత్తి చేలకు ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించాలని శ్రీను కోరుతున్నాడు.

- (ఆంధ్రజ్యోతి,మోత్కూరు)

భారీ వర్షంతో అతలాకుతలం

సగటున 78.4మి.మీ వర్షపాతం



యాదాద్రి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. సగటున 78.4 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గుండాలలో 16.08సెం.మీ., ఆత్మకూరు(ఎం)లో 14సెం.మీ., తుర్కపల్లిలో 12.14సెం.మీ., అడ్డగూడూరులో 12.04..

- మిగతా 8వ పేజీలో...

యూరియా సరఫరాపై దృష్టి సారించాలి

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ అక్షాంశ్‌యాదవ్, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి (కలెక్టరేట్), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగుకు అవసరమైన యూరియా రైతులకు అందేలా కలెక్టర్లు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జూలైతోపాటు ప్రస్తుత నెలలో భారీ వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఒకేసారి పంటలు సాగు చేయడంతో కొంతమేర యూరియా కొరత ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 3లక్షల మెట్రిక్ టన్నుల యూరియా తక్కువగా సరఫరా జరిగిందన్నారు. రానున్న 45 రోజులు యూరియా సరఫరా సరిగా జరిగేలా కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు. మండల స్థాయిలో నిల్వ వివరాలను పర్యవేక్షిస్తూ అవసరం మేరకు తరలించాలన్నారు. సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ, అవసరమైన యూరియా సరఫరా లేకపోవడం, ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంట్‌లో సాంకేతిక కారణాలతో ఉత్పత్తి నిలిచిపోవడంతో కొంతమేర యూరియా కొరత ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరుపుతూ యూరియా తీసుకువచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. ఎరువుల కొరత, యూరియా లభ్యతపై కలెక్టర్లు ప్రతీ రోజు పర్యవేక్షించాలన్నారు. వ్యవసాయ అధికారులతో పాటు టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేసి ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ ఆక్షాంశ్ యాదవ్, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, ఆర్డీవో కృష్ణారెడ్డి, పరిశ్రమలశాఖ జీఎం రవీందర్, జిల్లా వ్యవసాయాధికారి రమణారెడ్డి, ఏడీఏ నీలిమ, జిల్లా సహకారశాఖ అధికారి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

కలెక్టర్ హనుమంతరావు



సర్వాయి పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం మండలంలోని వంగపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి వివరాలను ఎంపీడీవో నవీన్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు బిల్లులు వచ్చాయా అని లబ్ధిదారులను ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఎంపీవో చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ కానుగు కవితబాల్‌రాజ్‌గౌడ్, తదితరులు ఉన్నారు. అనంతరం మండలంలోని మల్లిగూడెం-చొల్లేరు గ్రామాల మధ్య రహదారిపై కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న వరదను కలెక్టర్ పరిశీలించారు. రాకపోకలను నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ గణేష్‌నాయక్, తదితరులు ఉన్నారు.

ఎంఎల్‌హెచ్‌సీకి కలెక్టర్ షోకాజ్

యాదగిరిగుట్ట మండలంలోని పల్లె దవాఖానాను కలెక్టర్ తనిఖీచేసి ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఎంఎల్‌హెచ్‌సీ అనూషకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు.

బహుజన విప్లవకారుడు పాపన్నగౌడ్

(ఆంధ్రజ్యోతి, భువనగిరి కలెక్టరేట్): బహుజన రాజ్యాధికారం కోసం పోరాడిన యుద్ధవీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వాయి పాపన్నగౌడ్ జయంతిలో ఆయన మాట్లాడారు. బహుజన రాజ్యాధికారం కోసం భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసిన పాపన్నగౌడ్ పోరాటం వీరోచితమన్నారు. ఆయన అడుగు జాడల్లో నడవాలన్నారు. తొలుత పాపన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులకు ప్రాధాన్యం

'ప్రజావాణి'లో ఇచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వీరారెడ్డితో కలిసి 36 దరఖాస్తులు తీసుకున్నారు. వాటిలో అత్యధికంగా రెవెన్యూశాఖకు చెందిన 23 దరఖాస్తులు ఉన్నాయి. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎన్.శోభారాణి, డీఆర్వో ఎం.జయమ్మ, డీఆర్డీవో నాగిరెడ్డి, గృహ నిర్మాణశాఖ పీడీ విజయ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

వాగులు దాటే ప్రయత్నం చేయవద్దు

(ఆంధ్రజ్యోతి, బీబీనగర్): భారీ వర్షాల కారణంగా వాగులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో వాటిని దాటే ప్రయత్నం చేసి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం బీబీనగర్-గూడూరు మధ్య జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు కల్వర్టుపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న చిన్నేటి వాగును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శామీర్‌పేట చెరువు నుంచి చిన్నేటి వాగుకు వరద తాకిడి పెరిగిందన్నారు. గూడూరు, అన్నంపట్ల, అనాజీపురం, బొల్లేపల్లి, నాగిరెడ్డిపల్లి మార్గాల్లో ప్రజలు రోడ్డు దాటకుండా ముళ్లకంచె, పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సర్వాయిపాపన్న ఆశయాలతో ముందుకు



ఆలేరులో సర్వాయిపాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విప్ బీర్ల అయిలయ్య

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఆలేరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బహుజనులకు రాజ్యాధికారం కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. సోమవారం పాపన్న జయంతి సందర్భంగా ఆలేరులో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాపన్న అన్ని కులాలను ఐక్యం చేసి దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. బీసీలకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాపన్న ఆశయాల సాధనలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు తీసుకువచ్చిందన్నారు. ఆయన జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారన్నారు. గౌడ సంఘం భవన నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. తొలుత పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాగా, పట్టణానికి చెందిన గౌడ సంఘం అధ్యక్షుడు గనగాని శంకర్‌గౌడ్ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు విప్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కొలనుపాకను అభివృద్ధి చేస్తాం

(ఆంధ్రజ్యోతి, ఆలేరు రూరల్): భక్తి, ఉద్యమాల చరిత్ర ఉన్న ఆలేరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా సోమవారం కొలనుపాకలో ఉదయం 7 నుంచి 1 గంటల వరకు అన్ని వార్డులను తిరిగి ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేసుకోవాలన్నారు. వారంలో రెండు రోజులు ఆది, సోమవారం మార్నింగ్ వాక్ నిర్వహిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. అదేవిధంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా కొలనుపాక, ఆలేరులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొలనుపాకలో ఉన్న 66 ఇనుప విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని ట్రాన్స్‌కో డీఈ ఎస్.వెంకటేశ్వర్లును ఫోన్‌లో ఆదేశించారు.

ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీలు పల్లె శ్రీనివాస్‌గౌడ్, జనగాం ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రాజు,ఎజాజ్, మాజీ ఎంపీపీ గంధమల్ల అశోక్,ఆరె.ప్రశాంత్, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో సత్యాంజనేయప్రసాద్, యాలాద్రి, కాంద్రాజు వెంకటేశ్వర్‌రాజు, విజయేందర్‌రెడ్డి, సోమిరెడ్డి, తుంగ కుమార్, మోత్కూరు అయిలయ్య, తిరుపతి, చిలుకు కిష్టయ్యగౌడ సంఘం పట్టణ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, సాగర్‌రెడ్డి, ప్రశాంత్, రాజశేఖర్‌గౌడ్,విజయ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ మహాధర్నాను విజయవంతం చేయాలి


జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపేందర్‌రెడ్డి

భువనగిరి (కలెక్టరేట్), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ విద్రోహ దినం సెప్టెంబరు 1న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే పీఆర్టీయూ టీఎస్ మహాధర్నాను విజయవంతం చేయాలని ఉద్యోగ జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉద్యోగ సంఘాల నాయకులతో కలిసి సీపీఎస్ విద్రోహ దినం మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీపీఎస్‌ను రద్దు చేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించి నేటికీ అమలు చేయలేదన్నారు. సీపీఎస్ పరిధిలో ఉన్న 80శాతం ఉద్యోగులు నేడు అభద్రతా భావంలో ఉన్నారని, వెంటనే రద్దు చేసి ఓపీఎస్‌ను అమలుచేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ధర్నాలకు ఉపాధ్యాయ, ఉద్యోగులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీరారెడ్డి, కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, జగన్, భగత్, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీహార్‌లో ఓటర్ల తొలగింపును ఖండించాలి



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య

వలిగొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రంలో ఓటర్ల జాబితాను తారుమారు చేసి ఓటర్ల తొలగింపును అంతా ఖండించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కమ్మగూడెంలో నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. బీహార్ రాష్ట్రంలో 5.50లక్షల ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడం దారుణమన్నారు. బతికున్న వారిని చనిపోయినట్టు చూపిస్తూ ఎన్నికల కమిషన్ నాటకాలు ఆడుతోందని విమర్శించారు. ఇతర రాష్ట్రాలకు వలస పోయిన వారి ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య, నాయకుల గడ్డం వెంకటేశం, తుర్కపల్లి సురేందర్, సురేష్, నారాయణ, శ్రీరాములు, శ్రీను, యాదగిరి రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి: డీఈవో



దూదివెంకటాపూర్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న డీఈవో సత్యనారాయణ

రాజాపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో పాటు దాతల సేవలను వినియోగించుకోవాలని జిల్లా విద్యాధికారి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దూదివెంకటాపూర్ ఉన్నత పాఠశాలలో సినగబోయిన నర్సింహ యాదవ్ సహకారంతో భువనగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 15 మంది విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతీ రోజు పాఠశాలకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ గవర్నర్ శ్రీరాం ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, వెంకటనారాయణ, శెట్టి బాలయ్య, బండారు శ్రీనివాసారావు, ఎంఈవో చందా రమేశ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఈవో పాఠశాలలో తరగతి గదులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అదేవిధంగా సింగారం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు దాతలు ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో షేక్‌సాదుల్ బాబ, పోచంపల్లి సుధాకర్, జోగు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకళల ప్రదర్శనను విజయవంతం చేయాలి



సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శివకుమార్, తదితరులు

రామన్నపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రామన్నపేటలో ఈనెల 20, 21న ప్రజానాట్య మండలి జిల్లా మహాసభల సందర్భంగా నిర్వహించే జానపద కళాకారుల ప్రదర్శనను విజయవంతం చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కక్కిరేణి గ్రామంలో నిర్వహించిన హనుమాన్ భజన బృందం కళాకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ కళాకారులను ప్రోత్సహించేందుకు ఈనెల 20, 21న జానపద కళాకారుల ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రదర్శనల్లో అన్ని రంగాల కళాకారులు పాల్గొనాలని కోరారు. అనంతరం సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిల్ల యాదయ్య, గంటెపాక శ్రీకృష్ణ, సాయి, యశ్వంత్, వృత్తి సంఘాల నాయకులు వేముల సైదులు, కన్నెబోయిన యాదయ్య, భజన కళాకారులు చిల్ల రమేష్, సైదులు, భాషబోయిన శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సమదృష్టి సాధ్యం

- గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతిభగల క్రీడాకారులు
- బీసీసీఐ మాజీ సెలక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్



6

క్రీడలతో సమదృష్టి సాధ్యం

- గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతిభగల క్రీడాకారులు
- సౌకర్యాలు లేకనే క్రీడల్లో వెనుకబాటు
- బీసీసీఐ మాజీ సెలక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్



అతిథితో కాసేపు

విద్యార్థి దశలో క్రీడలు ఎంతో ముఖ్యం. చదువుతో పాటు క్రీడాలకు ప్రాధాన్యమివ్వాలి. తద్వారా పిల్లలు ధృడంగా తయారవుతారు. ఒకప్పుడు క్రీడలకు విద్యా సంస్థల్లో ప్రాధాన్యమిచ్చేవారు. గెలుపోటములను సమానంగా తీసుకునే శక్తి ఒక్క క్రీడాకారుడికి ఉంటుంది, అది కూడా క్రీడల ద్వారానే అబ్బుతుందని భారత క్రికెట్ జట్టు మాజీ సెలక్టర్, క్రికెట్ జట్టు మాజీ సభ్యుడు ఎంఎస్‌కే ప్రసాద్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ విద్యకు మాత్రమే ప్రాధాన్యమిస్తున్నారు. దానితో పాటే క్రీడలకు సమప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే పిల్లులు ధృడంగా మారడంతో మానసిక ఉల్లాసంతో ఉత్సాహంగా ఉంటారు. పిల్లలకు ఇష్టమైన క్రీడల్లో రాణిస్తే వారు ఆరోగ్యంగా ఉండటంతో పాటు బలమైన ఆరోగ్యకర సమాజమూ నిర్మితమవుతుంది. క్రీడలు లేకపోతే బాల్యం, విద్య కోల్పోయే ప్రమాదముంది.

గెలుపోటములపై సమాన దృక్పథం క్రీడల్లోనే

పోటీల్లో పాల్గొనే వారందరికీ మెడల్స్ రావు, అయినా క్రీడాకారుడికి మెడల్స్ ముఖ్యం కాదు. ఆడిన ప్రతి ఒక్కరికీ మెడల్స్ రావు. కానీ జీవితంలో గెలుపు, ఓటములను నేర్పుతాయి. దీంతో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తట్టుకునే శక్తి సమకూరుతుంది. జీవితంలో గెలుపు, ఓటములను సమానంగా తీసుకునే శక్తి ఒక క్రీడలకు మాత్రమే ఉంది.

గ్రామాల్లో సరైన సౌకర్యాలు లేకనే

క్రీడలు పట్టణాలకే పరిమితం కాకూడదు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉంటారు. వారు రాణించేందుకు సరైన సౌకర్యాలు లేక వెలుగులోకి రావడం లేదు. అలాంటి వారిని గుర్తించి వారిలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు చర్యలు చేపట్టాం.

కష్టపడి ఎదిగిన వారిలో సిరాజ్ ఒకరు

ప్రతి ఒక్క క్రికెటర్ ఇండియా టీమ్‌కు ఆడలేరు. అందులో అత్యంత మెరుగైన ప్రతిభ కలిగిన వారు మాత్రమే జట్టుకు ఎంపికవుతారు. ఇండియా టీమ్‌కు ఆడకపోయినా ఇంకా ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఇండియా టీమ్‌కు ఆడుతున్న ఎంతోమంది క్రికెటర్లు ఎంతో కష్టపడి ఎంపికైన వారే. అందులో పేసర్ మహ్మద్‌సిరాజ్ ఒకరు. క్రీడా పోటీలతో భవిష్యత్‌ను బాగు చేసుకోవచ్చు. ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీ లేదు.

కొత్తవారికి ఐపీఎల్ వేదిక

ఐపీఎల్ ఎంతోమంది క్రీడాకారులను వెలుగులోకి తెచ్చింది. అక్కడే చాలామంది ప్రతిభను కనబరిచి భారత జట్టుకు ఎంపికవుతున్నారు. 13ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ ద్వారానే వెలుగులోకి వచ్చాడు. ఇందుకు ఐపీఎల్ నిర్వాహకులు, రాష్ట్రాల క్రికెట్ అసోసియేషన్లు, వివిధ ఐపీఎల్ క్రికెట్ జట్ల ఫ్రాంచైజీలకు కృతజ్ఞతలు. క్రీడాకారులు వెలుగులోకి రావడంతో పాటు ఐపీఎల్ ద్వారా బీసీసీఐకి కూడా ఆదాయం సమకూరుతోంది.

క్రికెట్ అకాడమీల ఏర్పాటు

క్రీడా నైపుణ్యం కలిగిన గ్రామీణ, పట్టణాల్లోని క్రికెటర్లకు శిక్షణ ఇచ్చేందుకు క్రికెట్ అకాడమీలను ఏర్పాటుచేస్తున్నాం. ఇప్పటికే హైదరాబాద్‌లో మూడు, గుంటూరు సమీపంలోని నంబూరులో ఒకటి, విశాఖపట్నంలో ఒకటి, ప్రస్తుతం సూర్యాపేటలో ఒక అకాడమీని ఏర్పాటుచేశాం. అంతేకాకుండా తెలుగువారి కోసం అమెరికాలో కూడా క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నాం. మా అకాడమీలో విద్యతో పాటు క్రికెట్‌కు ప్రాధాన్యమిస్తాం. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే విషయంలో ప్రజలు, ప్రభుత్వం భాగస్వాములు కావాలి. అకాడమీలను ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చే వారిని ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.

పక్షం రోజుల్లో తలకిందులు

- 15 రోజుల క్రితం వరకు అనావృష్టి, ఇప్పుడు అతివృష్టి
- వరుస వర్షాలతో జాలు వారుతున్న పత్తి, కంది, మెట్టపంటలు



మోత్కూరులో జాలువారిన కంది చేను

మోత్కూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పక్షం రోజుల్లో సాగు పరిస్థితులు తారుమారయ్యాయి. 15 రోజుల కింది వరకు అనావృష్టి ఉండగా ఇప్పుడు అతివృష్టి నెలకొంది. వానాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాలు లేక రైతులు నానా ఇబ్బంది పడ్డారు. పలుచోట్ల వరుణ దేవుడి కరుణ కోసం కప్పకాముడు ఆడారు. వరద పాశం తిన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అయినా వర్షాలు కురియక ఆశించిన స్థాయిలో వరి నాట్లు వేయలేదు. రెండున్నర మాసాల్లో మూడు అడుగుల ఎత్తు పెరగాల్సిన పత్తి, కంది తదితర మెట్ట పంటల చేను ఒక్క అడుగు ఎత్తు మాత్రమే పెరిగాయి. పంగ (కొమ్మలు) తేలలేదు. మొక్కలు ఎదగకుండానే పత్తి చేను పూతకొచ్చింది. ఈ సారి దిగుబడులు అంతంత మాత్రంగా ఉంటాయని రైతులు దిగాలు పడుతున్న పడ్డారు. అయితే ఈ నెల 7 నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా, చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరుతోంది. బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఈ వానాకాలం సాగుకు నీటి కొరత తీరిందని రైతులు కొంత ఊరట చెందగా, వారం రోజుల నుంచి వరుసగా రోజూ కురుస్తున్న వర్షాలతో మెట్ట పంటలు దెబ్బతింటున్నాయి. దీంతో రైతుల్లో మళ్లీ ఆందోళన పెరిగింది.

యాదాద్రి భువనగిరి జిల్లాలో...

యాదాద్రి భువనగిరి జిల్లాలో వానాకాలం ఇప్పటి వరకు 2,06,523 ఎకరాల్లో వరి, 1,07,710 ఎకరాల్లో పత్తి, 3,037 ఎకరాల్లో కంది, 3,274 ఎకరాల్లో ఇతర మెట్ట పంటలు సాగు చేశారు.

జాలు వారుతున్న పత్తి, కంది చేలు

వారం రోజులుగా ప్రతిరోజూ వర్షం కురుస్తుండటంతో పత్తి, కంది చేన్లలో నేల తడారక జాలువారుతున్నాయి. అప్పుడు వర్షాలు లేక చేలు ఎదగలేదని, ఇప్పుడు రోజూ కురుస్తున్న వర్షాలతో పత్తి చేలల్లో పూత, గూడ(పిందె) రాలుతుందని రైతులు తెలిపారు. చేను కూడా ఎత్తు పెరగపోవడంతో భారీ వర్షాలకు పత్తి మొక్కలు నేలవాలుతున్నాయని తెలిపారు. వర్షాలకు తెగుళ్ల బెడత పెరుగుతోంది. నేల ఆరక జాలు వారడంతో జాజు రోగం సోకే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో పత్తి రెండు, మూడు సార్లు ఏరుకున్నాక జాజు రోగం వచ్చేదని, ఇప్పుడు పత్తి ఏరడం ప్రారంభించక ముందే జాజు రోగం వచ్చేలా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు కంది మొక్కలు కూడా జాలుపట్టి కుళ్లి పోతున్నాయంటున్నారు.

పూత, పిందె, ఆకు రాలింది



నాలుగు ఎకరాల్లో పత్తి పంట వేశా. వర్షాలు లేక విత్తిన విత్తనాలు మొలకెత్తక రెండు సార్లు విత్తాను. మొలకెత్తాక కూడా సరైన వర్షాలు లేక చేను ఎత్తు పెరగలేదు. పూత, పిందె వచ్చింది. సుమారు రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టా. ఇప్పుడు రోజూ వర్షం కురుస్తుండటంతో పత్తి చేను జాలువారి పూత, పిందె,ఆకు రాల్చింది. ఏంచేయాల్లో తోచడం లేదు.

- బండి నాగరాజు, పత్తి రైతు, లక్ష్మీదేవికాల్వ

నీరు తీసివేసి, పోషకాలు అందించాలి



వర్షాలు అధికంగా కురుస్తున్నందున పత్తి చేన్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పత్తి మొక్కలకు తగిన పోషకాలు అందించేందుకు 19-19-19 లేదా 13-0-45 లీటర్‌కు 10 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ కలిపి భూమిలో మొక్కకు నాలుగు అంగుళాల దూరంలో వేయాలి. పత్తి చేనులో గుంపులు, గుంపులుగా మొక్కలు ఎండి పోవడం గమనిస్తే అది వేరుకుళ్లుగా భావించి మొక్కల మొదట్లో చుట్టూ వేరు బాగా తడిసేట్టుగా లీటర్ నీటికి 2.5గ్రాముల కార్బండిజం ప్లస్ మ్యాన్కోజెబ్ కల్పిన మిశ్రమం లేదా మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలి.

- వీ.కీర్తి, ఎంఏవో, మోత్కూరు

బీఎస్ఎన్ఎల్ కేబుల్ చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సూర్యాపేట క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జల్సాల కోసం బీఎస్ఎన్ఎల్ టవర్ల వద్ద ఉండే రేడియో ఫ్రీక్వెన్సీ కేబుల్‌ను చోరీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను సూర్యాపేట జిల్లా మునగాల పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2.75లక్షల నగదు, 270 మీటర్ల రేడియో ఫ్రీక్వెన్సీ కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించి మరొక వ్యక్తి పరారీలో ఉన్నాడు. సోమవారం కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ కొత్తపల్లి నర్సింహ జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. కొన్ని నెలలుగా మునగాల, నడిగూడెం పోలీస్‌స్టేషన్ల పరిధిలోని బీఎస్ఎన్ఎల్ టవర్లకు సంబంధించిన రేడియో ఫ్రీక్వెన్సీ కేబుల్ చోరీకి గురవుతున్నాయని బీఎస్ఎన్ఎల్ అధికారులు నడిగూడెం, మునగాల పోలీసులకు ఫిర్యాదుచేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దీంతో పాటు కేసు దర్యాప్తులో భాగంగా నడిగూడెం, మునగాల మండలాల పరిధిలోని ప్రజలను అప్రమత్తం చేశారు. కొత్త వ్యక్తులు బీఎస్ఎన్ఎల్ టవర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, సాగునీటి కాల్వల వెంట కనిపిస్తే విధిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. దీంతో ఈ నెల 18న మునగాల మండలం ఆకుపాముల సమీపంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ దగ్గర ఇద్దరు వ్యక్తులు సంచరిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఎస్ఐ తన సిబ్బందితో అక్కడకి చేరుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నాడు. వారిని ప్రశ్నించగా సరైన సమాధానం రాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. విచారణలో భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డి మండలం రాజపురం గ్రామానికి చెందిన, ప్రస్తుతం కోదాడ సమీపంలోని బాలాజీనగర్‌లో ఉంటున్న కారు మెకానిక్‌గా పని చేసే మహంకాళి శ్రీనాథ్, రాజపురం గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే బుడుపుల వంశీకృష్ణలుగా గుర్తించారు. వీరితో పాటు కోదాడలోని బాలాజీనగర్‌కు చెందిన ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే చలిగంటి శ్రవణ్‌కుమార్‌తో కలిసి కొన్నినెలలుగా మునగాల, నడిగూడెం, కోదాడ పట్టణం, హాలియా, మిర్యాలగూడ, గరిడేపల్లి, హుజూర్‌నగర్, చిలుకూరు, నేలకొండపల్లి ప్రాంతాల్లో నిఘా లేని బీఎస్ఎన్ఎల్ టవర్ల వద్ద రేడియో ఫ్రీక్వెన్సీ కేబుల్‌ను చోరీ చేస్తున్నారు. కేబుల్‌ను కాల్చి అందులోని కాపర్‌ను హైదరాబాద్‌లోని వివిధ గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నట్లు అంగీకరించారు. ఇప్పటివరకు 9 పర్యాయాలు చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. అందులో భాగంగానే ఆకుపాముల బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద చోరీ చేద్దామని రెక్కీ నిర్వహిస్తున్నట్లు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. దీంతో వారు ప్రయాణిస్తున్న కారును తనిఖీచేయగా అందులో రూ.2.75లక్షల నగదు, 270 మీటర్ల రేడియో ఫ్రీక్వెన్సీ కేబుల్ లభించిందన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని మహంకాళి శ్రీనాథ్, వంశీకృష్ణ, శ్రవణ్‌కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం శ్రీనాథ్, వంశీకృష్ణలను కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నామని శ్రవణ్ కుమార్ పరారీలో ఉన్నాడని త్వరలో పట్టుకుంటామని వెల్లడించారు. పరారీలో ఉన్న శ్రవణ్‌కుమార్‌కు గతంలో బీఎస్ఎన్ఎల్ టవర్స్ వద్ద పనిచేసిన అనుభవం ఉందని, అతడిపై గతంలో నాలుగు చోరీ కేసులు ఉన్నాయన్నారు. బీఎస్ఎన్ఎల్ టవర్ల వద్ద చోరీకి పాల్పడుతున్న వ్యక్తులను పట్టుకున్న మునగాల పోలీసులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో మునగాల సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్‌బీఐ రామారావు, మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు ఇవ్వాలంటే డబ్బులివ్వాల్సిందే

లబ్ధిదారుడితో పంచాయతీ కార్యదర్శి ఆడియో వైరల్

పాలకవీడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు రావాలంటే లంచం ఇవ్వాలని ఓ లబ్ధిదారుడిని గ్రామ కార్యదర్శి డిమాండ్ చేస్తున్న ఆడియో చర్చనీయాంశమైంది. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండల పరిధిలోని పాలకవీడు వాట్సప్ గ్రూపులో సోమవారం ఇందుకు సంబంధించిన ఆడియో వైరల్ అయింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ ఇందిరమ్మ ఇళ్ల పైలట్ గ్రామంగా ఎంపికైంది. గ్రామంలో ఇళ్ల నిర్మాణానికి 300మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. రెండు నెలల క్రితం ఈ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించగా కొన్ని ఇళ్లు పునాదుల దశకు, మరికొన్ని స్లాబ్ వరకు వచ్చాయి. ఇప్పటివరకు పూర్తైయిన ఓ ఇంటి నిర్మాణానికి బిల్లులు రావాలంటే రెండు దఫాలుగా రూ.15వేలు ఇవ్వాలని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి లబ్ధిదారుడితో ఫోన్‌లో మాట్లాడిన ఆడియో వాట్సప్ గ్రూపులో రావటంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఆ గ్రామ కార్యదర్శి వెంకట్‌ను వివరణ కోరగా లబ్ధిదారుడితో మాట్లాడిన సందర్భంలో తాను అయోమయంలో ఉన్నానని, ఏం మాట్లాడానో తెలియదన్నారు. ఈ ఘటనపై పాలకవీడు ఎంపీడీవో లక్ష్మిని వివరణ కోరగా, ఆ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. విచారణకు ఆదేశించామని, ఆడియో నిజమని తేలితే పంచాయతీ కార్యదర్శిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కబేళాకు తరలిస్తున్న పశువుల పట్టివేత

కోదాడ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కబేళాకు తరలిస్తున్న పశువులను సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రాజమండ్రి సమీపంలోని జక్కంపూడి పశువుల సంత నుంచి 32 గేదెలను హైదరాబాద్‌కు ఆదివారం రాత్రి తరలిస్తున్నారు. మండలంలోని నల్లబండగూడెం పంచాయతీ పరిధిలోని రామాపురం క్రాస్ రోడ్డు వాహనాల తనిఖీలో భాగంగా గుర్తించి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. డీసీఎం డ్రైవర్ ఎర్రంశెట్టి సాయి, హేమంత్‌రాజుకుమార్, ఎలమంచిలి రాంబాబు, పశువుల కొనుగోలు దారుడు శ్రీను, డీసీఎం యజమాని దేవీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శిథిల భవనం.. వర్షం వస్తే భయం





శిథిలావస్థకు చేరిన దేవరకొండలోని ఆర్డీవో కార్యాలయం. ధ్వంసమైన కార్యాలయ సీలింగ్

నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్‌లో వర్షం పడిందంటే ప్రభుత్వ కార్యాలయాలు కురుస్తున్నాయి. 2013లో అప్పటి పట్టు పరిశ్రమ కార్యాలయానికి తాత్కాలిక మరమ్మతులు చేసి ఆర్డీవో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆ భవనం 50 ఏళ్ల నాటిది కావడంతో పాటు పెచ్చులు ఊడి కురుస్తోంది. దీంతో ఉద్యోగులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా నిజాం కాలంలో వందేళ్ల కిందట గచ్చు గోడలతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం పరిస్థితి అంతంతమాత్రమే. పైకప్పు పెచ్చులు రాలుతూ కురుస్తోంది. దీంతో గదుల్లోని రికార్డులు, రికార్డులు, వర్షాలకు తడిచే పరిస్థితి నెలకొంది. కొంతకాలంగా తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వర్షం వస్తే ఎప్పుడు కూలుతుందోనని ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)





తహసీల్దార్ కార్యాలయంలోని ఏళ్ల నాటి రికార్డులు, శిథిలావస్థకు చేరిన నిజాం కాలం నాటి భవనం

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



భూక్య సుజాత(ఫైల్)

రాజాపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం పుట్టగూడెంలో సోమవారం అనుమానాస్పదంగా మహిళ మృతి చెందింది. ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన బూక్యా అమ్రు కూలీ పనులు చేస్తూ జీవనం గడుపుతున్నాడు. అతడికి అదే గ్రామానికి చెందిన బూక్యా సుజాత(36)తో వివాహం కాగా వారికి ముగ్గురు సంతానం. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తగాదాలు జరుగుతున్నాయి. దీంతో పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. అయినప్పటికీ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. రోజు మాదిరే నిద్రిస్తున్న సమయంలో ఆదివారం రాత్రి అమ్రు తన కుమారుడు రాకేష్ వద్దకు వచ్చి మీ అమ్మ సుజాత మాట్లాడటం లేదన్నాడు. కుమారుడు రాకేష్, గ్రామస్థులు సుజాతను రాజాపేటకు తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందింది. అనుమానాస్పదంగా మృతి చెందడంపై సుజాత తల్లి పింప్లీ ఫిర్యాదు చేసిందని ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని సోమవారం యాదగిగుట్ట ఏసీపీ శ్రీనివాసనాయుడు, సీఐ శంకర్‌గౌడ్ సందర్శించి, క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరిస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు గల్లంతు



నవీన్(ఫైల్)

వలిగొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు కాల్వలో పడి గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మోత్కూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన శివరాత్రి నవీన్(25) స్థానికంగా పనులు చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. సోమవారం అదే గ్రామానికి చెందిన మరో 10మంది యువకులతో కలిసి చేపలు పట్టేందుకు వలిగొండ మండలం వెల్వర్తి గ్రామానికి వచ్చారు. ఆ గ్రామంలోని ఊరు చివరన బ్రాహ్మణచెరువు నుంచి నర్సయ్యగూడెం వెళ్లే గ్రామాల మధ్యన ఓ కాల్వ ఉంది. ఈ కాల్వలో చేపలు పడుతుండగా అందులో పడి గల్లంతయ్యాడు. యువకుడి కోసం పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది స్థానికుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్కతో గాలింపు చర్యలకు కొంత ఆటంకం కలుగుతోంది. గాలింపు చర్యలను సోమవారం రాత్రి డీసీపీ అక్షాంశ్‌యాదవ్, రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లాలో తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు సోమవారం మృతి చెందాడు. సీఐ భాస్కర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదగిరిగుట్ట మండలం చిన్నకందుకూర్ గ్రామానికి చెందిన నల్లమాస చంద్రయ్య(45) గ్రామ సమీపంలోని తాటిచెట్టు ఎక్కుతుండగా పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. చంద్రయ్యకు భార్య పుష్పతో పాటు నలుగురు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులు మృతి చెందగా కోడళ్ల బాధ్యతను చంద్రయ్య చూసుకుంటున్నారు. కుమారుడు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భాస్కర్ తెలిపారు.

గంజాయి పట్టివేత

భువనగిరి టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి విక్రయించేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం అదుపులోకి తీసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన సర్వేష్ అనే మియా సర్కార్ సోమవారం రైల్వేస్టేషన్ ముందు అనుమానాస్పదంగా కనిపించాడు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ బృందం సర్వేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారించడంతో గంజాయి విక్రయ ప్రయత్నాలు వెలుగుచూశాయి. ఈ మేరకు నిందితుడి వద్ద రూ.7,500 విలువైన 15 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్టు టాస్క్‌ఫోర్స్ సీఐ రాధాకృష్ణ తెలిపారు. నిందితుడిని, స్వాధీనం చేసుకున్న గంజాయిని మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ

లక్ష్యంగా స్టీల్ బ్యాంక్

- విశ్రాంత ఉపాధ్యాయుడు పురుషోత్తంరెడ్డి వినూత్న యత్నం



స్టీల్ సామాగ్రిని అందజేస్తున్న పురుషోత్తంరెడ్డి

భువనగిరి టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విందుల్లో వినియోగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కోటెడ్ భోజనం, టిఫిన్ ప్లేట్లు, ప్లాస్టిక్ స్వీట్ కప్స్, స్పూన్స్, వాటర్ గ్లాస్‌లు పర్యావరణానికి ముప్పుగా పరిణమిస్తున్నాయి. చిన్న పాటి విందులు, వినోదాలు జరిగినా ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వినియోగం తప్పనిసరి అవుతున్న పరిస్థితులు ప్రస్తుతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు తన వంతు బాధ్యతగా యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు వెళ్మంకి పురుషోత్తంరెడ్డి వినూత్న రీతిలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు తన తండ్రి రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం రూ.50 వేల విలువైన స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, కప్పులు, స్పూన్స్ తదితర సామాగ్రిని స్వచ్ఛందంగా కాలనీలోని కమ్యూనిటీ హాల్‌కు ఆదివారం అందజేశారు. ఇక నుంచి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించే కార్యక్రమాలలో భోజనాలకు స్టీల్ సామాగ్రిని ఉచితంగా వినియోగించి పర్యావరణ పరిరక్షణకు, ప్లాస్టిక్ రహిత కాలనీ ప్రయత్నాలకు సహకరించాలని ఆయన కోరారు. స్టీల్ బ్యాంక్ ఏర్పాటుచేసిన పురుషోత్తంరెడ్డిని కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు బీ లక్ష్మారెడ్డి, రఘుపతి, ఉపాధ్యక్షుడు ఎలగల రాజయ్యతో పాటు కాలనీ వాసులు అభినందించారు.

ప్రథమ చికిత్స చేసిన పోలీసులు



క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేస్తున్న పోలీసులు

ఆలేరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పోలీసులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన సోమవారం మండలంలోని బహదూర్‌పేటలో జరిగింది. మోటకొండూరు మండలం ఇక్కుర్తి గ్రామానికి చెందిన వంగాల మధుసూదన్‌రెడ్డి పనినిమిత్తం ద్విచక్రవాహనంపై వచ్చి తిరుగు ప్రయాణమయ్యాడు. బహదూర్‌పేట సమీపంలో అతడు వాహనం నుంచి పడిపోయాడు. తలకు బలమైన గాయాలు తగిలి అలాగే రోడ్డుపై ఉండిపోయాడు. అటుగా పెట్రోలింగ్‌కు వెళ్లి వస్తున్న ఆలేరు పోలీసులు మధుసూదన్‌రెడ్డికి మంచినీరు తాగించారు. వారి వద్ద ఉన్న ఫస్ట్‌ఎయిడ్‌తో ప్రథమ చికిత్స చేశారు. అనంతరం 108 వాహనంలో ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులను బహదూర్‌పేట గ్రామస్థులు ప్రశంసించారు. కానిస్టేబుల్స్ సైదులు, ప్రసాద్, నవీన్, అశోక్, నరేష్‌ను అభినందించారు.

తల్లి చనిపోయిందన్న మనోవేదనతో కుమారుడి మృతి

మోత్కూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో అన్నెపువాడకు చెందిన బొల్లు సాయిలు సుమారు రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. అతనిది నిరుపేద కుటుంబం. భార్య సైదమ్మ కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తుండగా తల్లి అతడికి సేవలు చేసేది. నెల రోజుల కిందట తల్లి గుండెపోటుతో మృతి చెందింది. దీంతో సాయిలు తీవ్ర మనోవేదనకు గురై ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆ కుటుంబానికి ఎలాంటి స్థిర, చరాస్తులు లేవు. ఉండటానికి ఇల్లు కూడ లేక పూరి గుడిసెలో ఉంటున్నారు. అతడికి ఇద్దరు కుమార్తెలు. వారూ చిన్నపిల్లలు. సాయిలు అంత్యక్రియలకు కూడా డబ్బులు లేకపోవడంతో మన మోత్కూరు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు అంత్యక్రియల నిమిత్తం సోమవారం ఆ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసహాయం అందించారు. దశదిన కర్మ వరకు మరింత సహాయం అందిస్తామన్నారు. పెద్ద కుమార్తె శ్రావణి తండ్రికి తలకొరివి పెట్టింది. ఆర్థిక సహాయం అందించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దబ్బెటి సోంబాబు, కారుపోతుల వెంకన్న, కోమటి మత్స్యగిరి, మొరిగాల శ్రీనివాస్, కోమటి జనార్ధన్ పాల్గొన్నారు.

26గేట్ల నుంచి సాగర్ నీటి విడుదల


ఎనిమిది గేట్ల నుంచి విడుదలవుతున్న మూసీ ప్రాజెక్టు నీరు

నాగార్జునసాగర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువనుంచి వరద రాక పోటెత్తింది. ఈ సీజన్‌లో మూడు లక్షల పైచిలుకు వరద రావడం ఇదే మొదటిసారి. దీంతో సాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 585.90 అడుగులుగా (300.0315టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 6,006క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 4,949క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 300క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,745క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కులు, 26క్రస్ట్ గేట్ల నుంచి 2,51,582 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,93,982 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా ఎగువనుంచి 3,05,553 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

ఎనిమిది గేట్ల నుంచి మూసీ నీటి విడుదల

కేతేపల్లి: హైదరాబాద్ నగరంలో కురిసిన వర్షానికి సోమవారం మరోసారి మూసీ రిజర్వాయర్‌కు వరద పెరిగింది. సోమవారం సాయంత్రానికి 15643.17 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు నీటిమట్టం 643.50అడుగుల గరిష్ఠ స్థాయికి చేరడంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు ఎనిమిది క్రస్ట్ గేట్లను మూడు అడుగుల మేర ఎత్తి 15,442.28క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 142.29క్యూసెక్కులు విడుదల కొనసాగుతోంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

వలిగొండ: యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సంగెం, బొల్లేపల్లి కల్వర్టు పైనుంచి వరద నీరు పెరుగుతుండడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. ప్రొద్దటూరు వర్కట్‌పల్లి గ్రామాల నడుమ రాకపోకలను కూడా నిలిపివేశారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు.

గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి

● సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి


గర్నెకుంటలో వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి

పెద్దవూర, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఐక్యంగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా పెద్దవూర మండల పరిధిలోని గర్నెకుంట, వెల్మగూడెం గ్రామాల్లో దాచిరెడ్డి మాధవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు దాచిరెడ్డి డీవీఎస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి రూ.12లక్షలతో ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. మాధవరెడ్డి ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి నీటి కొరత తీర్చడం అభినందనీయమన్నారు. కులాలకు, మతాలకు అతీతంగా గ్రామాల్లో ప్రజలు ఐక్యంగా ఉండాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉంటే ఇతర చెరువుల నుంచి నీటిని అందించి సమస్యను పరిష్కరిస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, నాయకులు ధర్మారెడ్డి, నాగరాజు, వెంకటయ్య, లక్ష్మయ్య, శంకర్, ఎంపీడీవో సుధీర్, గ్రామ కార్యదర్శి ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర అభ్యాసం అవసరం


మాట్లాడుతున్న విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నిరంతర అభ్యాసం అవసరమని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామ శివారులోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు ఆరోగ్యంగా, మానసికంగా, సర్వతోముఖాభివృద్ధి చెందుతారన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఫిజికల్ ఫిట్‌నెస్‌కు క్రెడిట్స్‌ను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, విజ్ఞాన్స్ యూనివర్సిటీ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పూనం మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

చివరి రైతుల అవస్థలు

- నీరందక ప్రతి సీజన్‌లోనూ ఇదే తంతు
- తూములు మరమ్మతులకు నోచక నీరంతా వృథా
- చెరువుల్లోకి నీరురాక పడిపోతున్న భూగర్భజలాలు

ఆయకట్టు చివరి భూములకు నీరందక రైతులు అవస్థ పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా కాల్వ నిర్మాణ పనులు పూర్తిచేసినా చివరి భూములకు నీరందం లేదని దీంతో తమ భూములు బీడుగా మారుతున్నాయని రైతులు వాపోతున్నారు. డి-40కాల్వకు 37తూములు నిర్మించినా వాటి మరమ్మతులు నోచుకోకపోవడంతో నీరంతా వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, మాడ్గులపల్లి


గుర్రప్పగూడెంలో ఎండిన చెరువులోకి దిగి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు (ఫైల్)

పానగల్లులోని ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏర్పాటైన డి-40 కాల్వను కట్టంగూరు మండలం బొల్లేపల్లి గ్రామంలో ప్రారంభమై నల్లగొండ మండలంలోని చిన్న సూరారంతోపాటు కొన్ని గ్రామాలను కలుపుకొని తిప్పర్తి మండలంలోని సర్వారం, పజ్జూర్, ఎరగండ్లగూడెం, వెంకటాద్రిపాలెం, సిలారిమీదిగూడెం, మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల, సీత్యాతండా, పుచ్చకాయలగూడెం, గుర్రప్ప గూడెం, గణపతివారిగూడెం, బొమ్మకల్ వరకు 23కిలోమీటర్ల మేరా కాల్వ విస్తరించడంతోపాటు 27వేల ఎకరాలకు ఆయకట్టుకు నీరందించేందుకు ఏర్పాటు చేశారు. రైతులు ఆశించిన మేర నీరు రాకపోవడంతో భూములు బీడుగా మారాయి. మాడ్గులపల్లి మండలంలోని గుర్రప్పగూడెం, ఇందుగుల, ఆగామోత్కూర్, సీత్యాతండా, బొమ్మకల్ గ్రామాల్లోని చెరువుల్లోకి సైతం నీరు రాకపోవడంతో భూగర్భజలాలు పడిపోతున్నాయి. మాడ్గులపల్లి మండలంలోని గ్రామాలు ఈ కాల్వపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. కాల్వ చివరి వరకు వస్తే సుమారు మూడు వేల ఎకరాలకు నీరందడంతోపాటు చెరువులు సమృద్ధిగా నిండి భూగర్భజలాలు పెరగడంతో బోరుబావుల మీద ఆధారపడిన రైతులు వ్యవసాయం చేసుకునే అవకాశముంది. నీరు చివరి వరకు రాకపోవడం మూలంగా ఎక్కువ మంది రైతులు వర్షాధారం మీద ఆధారపడి పంటలు పండిస్తున్నారు. డి-40 నీళ్ల చివరి వరకు వస్తే ఇందుగుల, గుర్రప్పగూడెం, సీత్యాతండా, పుచ్చకాయలగూడెం చెరువులు నిండే అవకాశముంది. తద్వారా భూగర్భ జలాలు పెరగడంతో రెండు పంటలు పండించుకునే అవకాశముంది. నీరు కిందకు రాకపోవడంతో బీడు భూములుగా ఉంచుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చివరి ఆయకట్టు నుంచి నీరందించడంతోపాటు చెరువులు నింపితే ఈ సమస్య ఉత్పన్నం కాదని రైతులు పేర్కొంటున్నారు.


నీరు లేక వెలవెలబోతున్న డి-40కాల్వ

మరమ్మతులకు నోచని డి-40 తూములు

డి-40 కాల్వకు 37తూములు నిర్మించినా వాటి మరమ్మతులు నోచుకోకపోవడంతో నీరంతా వృథా అవుతోంది. కాల్వ ప్రారంభం నుంచి తూములు సక్రమంగా ఉంటే చివరి దాకా నీరందే అవకాశముంది. తూములకు మరమ్మతులు లేకపోవడంతో నీరంతాపై రైతులు తూములను మూసివేసే పరిస్థితి లేదు. కాల్వకు ఎక్కువగా మోటార్లను ఉపయోగించి నీటిని వాడుకోవడం, అక్రమ తూములను ఏర్పాటు చేసి నీటిని కిందకు రాకుండాపై రైతులు ఆటంకపరుస్తున్నారని చివరి ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారబందీ విధానంతో నీరు కిందకు రాలేని పరిస్థితి నెలకొంది. నీటి విడుదల ప్రారంభించినా ఇప్పటివరకు నీరందడం లేదు.

చివరి ఆయకట్టుకు నీరందించాలి



డి-40 కాల్వ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరందించాలి. నీరు లేకపోవడంతో చెరువులు నిండకపోవడంతో భూగర్భజలాలు ఎండిపోయాయి. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి చివరి ఆయకట్టు వరకు నీరందించడంతోపాటు చెరువులను నింపాలి.

- మాడుగుల సాయిలు (పుచ్చకాయలగూడెం రైతు)

నీళ్ల కోసం తిప్పలు తప్పడం లేదు



డి-40 నీళ్ల కోసం తిప్పలు తప్పడం లేదు. నీటి విడుదలను ప్రారంభించినా చివరి భూముల వరకు రావడం లేదు. కాల్వల చుట్టు తిరిగినా పట్టించుకునే నాదుడే కరువయ్యారు. ఇప్పటికైనా నీటిని విడుదల సామర్థ్యాన్ని పెంచి చివరి భూములకు వరకు నీరందించేలా అధికారులు కృషిచేయాలి.

- వెంకట్‌రెడ్డి (మాజీ సర్పంచ్, రైతు, బొమ్మకల్)

రైతులకు ఇబ్బంది కలిగించం

డి-40కాల్వకు ఉదయ సముద్రం ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను ప్రారంభించాం. 0-10 తూము వరకు నాలుగు రోజులు, 11 నుంచి 37వ తూము వరకు నీటి విడుదలను కొనసాగిస్తున్నాం. ప్రస్తుతం ఇందుగుల గ్రామం వరకు నీరు చేరుకుంది. మరో మూడు రోజులు నీటి విడుదల కొనసాగుతుంది. రైతులకు ఎక్కడ ఇబ్బందులు కలిగించం. రైతులెవరూ ఆందోళన చెందవద్దు.

● ఆంజనేయస్వామి, డి-40 డీఈ

ముందుకు వెళ్లలేక.. వెనక్కి రాలేక

● చిట్యాలలో ఆరు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు ● చౌటుప్పల్‌లో కొనసాగిన వాహనాల రద్దీ


చౌటుప్పల్: హైదరాబాద్ వైపు జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు

చిట్యాల రూరల్, చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి, యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో 65వ జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. గంటల కొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు తీవ్రంగా శ్రమించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. సోమవారం జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరగడంతో పెద్దకాపర్తి నుంచి చిట్యాల వరకు సుమారు కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్‌జామ్ అయింది. విద్యా సంస్థలకు సెలవులు ముగియడంతో వాహనాలు హైదరాబాద్‌కు బాట పట్టాయి. పెద్దకాపర్తి వరకు వెళ్లేసరికి బస్‌స్టేజీ సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు కొనసాగుతుండడంతో వాహనాలను సర్వీసు రోడ్డు నుంచి దారి మళ్లిస్తున్నారు. వాహనాలు నెమ్మదిగా వెళ్తున్న క్రమంలో చిట్యాల నుంచి పెద్దకాపర్తి వరకు వెళ్లడానికి సుమారు 30నిమిషాలకు పైగా సమయం పట్టిందని వాహనదారులు తెలిపారు. వాహనాలు నిలిచిపోకుండా నార్కట్‌పల్లి సీఐ నాగరాజు పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ సిబ్బందితో పెద్దకాపర్తి వద్ద ఫ్లైఓవర్ వంతెన పనులు జరిగే ప్రాంతంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరింపజేశారు

రాత్రంతా వర్షం.. ట్రాఫిక్‌కు ఆటకం

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 11:30 గంటల వరకు వాహనాల రద్దీ కొనసాగింది. ఏపీలోని వైజాగ్, కాకినాడ, రాజమండ్రి, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు భారీగా వాహనాలు రావడంతో అంతా అయోమయ పరిస్థితి నెలకొంది. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ఫ్లైఓవర్ నిర్మిస్తుండడంతో కొన్ని వాహనాలను సర్వీసు రోడ్ల వెంట పంపిస్తున్నారు. ఈ క్రమంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో ఆదివారం రాత్రి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. చౌటుప్పల్ మీదుగా ఔటర్‌రింగ్ రోడ్డు వరకు ట్రాఫిక్ కొనసాగిందని వాహనదారులు తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు పోలీసులు తెల్లవారుజాము నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐలు మన్మథ కుమార్, విజయ్‌మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.


పెద్దకాపర్తిలో సర్వీసు రోడ్డు నుంచి వెళ్తున్న వాహనాలు

శివకేశవులకు విశేష పూజలు

యాదగిరిగుట్ట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్పటికమూర్తులకు శైవాగమశాస్త్ర రీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు మూల మూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్ర నామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్పటికమూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. వివిధ విభాగాల ద్వారా ఖజానాకు రూ.23,94,907 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.


లక్ష్మీనారసింహులకు కల్యాణం నిర్వహిస్తు హారతి నివేదిస్తున్న అర్చకుడు


కొనసాగిన భక్తుల రద్దీ

మూడు రోజుల(శుక్ర, శని, ఆదివారం) సెలవులు కావడంతో సోమవారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనం రెండు గంటలు, మధ్యాహ్నం ఆరగింపు గంట సమయం కలుపుకొని మూడు గంటల పాటు ఉభయ క్యూలైన్లల్లో భక్తులు వేచి ఉన్నారు. రాత్రి వరకు రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనానికి అర్ధగంట, ధర్మదర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 23వేల మంది దర్శించుకున్నారు. కొండపైన బస్టాండ్‌లో హైదరాబాద్‌కు చెందిన భక్తుల మధ్య బస్సు ఎక్కేటప్పుడు స్వల్ప వాగ్వాదం జరిగింది.

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనృసింహుడి ఆలయంలో సోమవారం విశేష అర్చనలు జరిగాయి. ఆలయంలో ప్రాతఃకాలార్చనలు పూర్తయాక అర్చకులు మూలవర్యులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన జరిగింది. ఉదయం 9:30గంటలకు లక్ష్మీనృసింహుడి పరిణయోత్సవ క్రతువు ప్రారంభమైంది. శ్రీదేవి, భూదేవి సమేత మట్టపల్లి లక్ష్మీనరసింహుడి మూర్తులను కల్యాణ వేదికపై అధిష్ఠింపజేసి విష్వక్సేనారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సరికొండ నవీన్ ఆలయ అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ఖిల్లా ముఖద్వారాన్ని పట్టించుకోరా?

దేవరకొండ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ ఖిల్లా ముఖ ద్వారాలు, ప్రధాన గోపురాలు వర్షాలకు కూలుతున్నాయి. పురావస్తు టూరిజం శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో పురాతన కట్టడాలు, శిల్పాలు దెబ్బతింటున్నాయి. 13వ శతాబ్దంలో నిర్మితమైన దేవరకొండ కోటకు 750 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రఉంది. తొలి ఏకాదశి, మహాశివరాత్రి పర్వదిన వేడుకలను దేవరకొండ ఖిల్లాలోని శివాలయంలో జరుపుకుంటారు. పర్యాటకులతోపాటు దేవరకొండ పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు కోటకు చేరుకొని దేవాలయంలో పూజలు చేస్తారు. దేవరకొండ ఖిల్లాలోని పూర్ణకుంభం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అధికార చిహ్నం. సుదీర్ఘ చరిత్రకలిగిన దేవరకొండ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


వర్షాలకు కూలుతున్న ఖిల్లా ముఖద్వారం

ఎరువుల కొరత తీర్చాలి

నల్లగొండ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో ఎరువుల కొరత తీర్చాలని నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలాలకు, పీఏసీఎస్‌లకు యూరియా సరఫరా కాకపోవడంతో పత్తి, వరి పంటలకు ఎరువులు లేక పంటలు ఎదగడం లేదని, పంటలు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపించనుందని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా పడటంతో పాటు సాగర్ ఆయకట్టుకు నీటివిడుదల వల్ల యూరియా అవసరాల పెరిగాయన్నారు. ఇప్పటికైనా జిల్లాకు సరిపడా ఎరువులను సరఫరా చేయాలని కోరారు.

హైలెవల్ హామీ అమలుకాలే!

● 2020లో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు ● మరమ్మతులు చేసి రాకపోకల పునరుద్ధరణ ● హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తామని గత ప్రభుత్వం హామీ ● కాంగ్రెస్ సర్కార్‌లోనైనా మంజూరయ్యేనా?


అమ్మనబోలు వద్ద మూసీ వాగుపై ఉన్న బ్రిడ్జి

నార్కట్‌పల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు-పొడిచేడు గ్రామాల మధ్య ఉన్న మూసీ వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం ఐదేళ్లుగా మాటలకే పరిమితమైంది. ఈ వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జిని హైలెవల్ బ్రిడ్జిగా మారుస్తామని బీఆర్ఎస్ హయాంలో అప్పటి మంత్రి జగదీశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. పాలకులు మారినా బ్రిడ్జి ప్రతిపాదనలు ముందుకు కదలడం లేదు. ఇదే మండల వాసి అయిన ప్రసుత రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. నల్లగొండ-యాదాద్రి భువనగిరి జిల్లాలకు సరిహద్దుగా అమ్మనబోలు-పొడిచేడు శివారుల్లో ప్రవహించే మూసీ వాగుపై లోలెవల్ బ్రిడ్జి ఉన్నది. 2020 అక్టోబరులో కురిసిన భారీ వర్షాలకు ఎగువన హైద్రాబాద్ నగరం నుంచి వచ్చిన వరద నీటి ఉధృతితో లోలెవల్ బ్రిడ్జికి అనుసంధానంగా ఉండే ఆర్అండ్‌బీ రోడ్డు కొట్టుకుపోయింది. రక్షణ గోడలు కూడా కొన్ని చోట్ల దెబ్బతిన్నాయి. దీంతో మోత్కూర్- నార్కట్‌పల్లి మధ్య అప్పట్లో కొన్ని రోజులు రాకపోకలు నిలిచిపోయాయి. అప్రోచ్ రోడ్డు సుమారు 184మీటర్ల మేర కొట్టుకుపోగా సుమారు రూ.75లక్షల అంచనా వ్యయంతో అప్పట్లో ఈ రోడ్డును పునరుద్ధరించారు. వరద ఉధృతికి దెబ్బతిన్న బ్రిడ్జిని అప్పటి మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పరిశీలించారు. వరద ఉధృతితో ఎప్పటికైనా ఈ బ్రిడ్జికి ముప్పేనని గ్రహించి హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అప్పటి సీఎం కేసీఆర్‌ను కలిసి ప్రత్యేక నిధుల కోసం ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా ఈ బ్రిడ్జి ఎత్తు పెంచే ప్రతిపాదనలు సిద్ధం కాలేదు.

మంత్రి కోమటిరెడ్డి దృష్టి పెడితే

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇదే మండల వాసి కావడం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవ చూపి ప్రత్యేక దృష్టి పెడితే మోక్షం లభించవచ్చని రెండు జిల్లాల ప్రజలు భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం హ్యామ్ విధానాన్ని అనుసరిస్తున్న నేపథ్యంలో అవకాశముంటే ఈ బ్రిడ్జిని కూడా హ్యామ్‌లో చేర్చి మోక్షం కలిగించాలని కోరుతున్నారు.

హైలెవల్ బ్రిడ్జి మంజూరు చేయాలి



అమ్మనబోలు-పొడిచేడు మధ్యలో ఉన్న మూసీ వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి. హైద్రాబాద్‌లో కురిసిన భారీ వర్షాలకు అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయినపుడు హైలెవల్ బ్రిడ్జిగా మారుస్తామని గత ప్రభుత్వంలో హామీ ఇచ్చారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా మూసీ వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. ఈ రోడ్డుపై రాకపోకలు పెరిగే అవకాశం దృష్ట్యా ఆ దిశగా స్థానిక నేతలు అధికార పార్టీ ప్రజాప్రతినిధులను కలిసి విజ్ఞప్తి చేయాలి.

● బద్దం రాంరెడ్డి, అమ్మనబోలు

పాఠశాల గది నిర్మాణానికి రూ.20 వేల విరాళం

వలిగొండ, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణానికి కాంగ్రెస్ మండల నాయకుడు అయిటిపాముల రవీంద్ర రూ. 20వేల విరాళాన్ని హెచ్ఎం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహకారం అందించడం సంతోషం కలిగించిదని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, నాయకులు బత్తిని సహదేవ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దిలీప్ రెడ్డి కుటుంబానికి ఆర్థిక సాయం

మోత్కూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగిబావి గ్రామానికి చెందిన గంట దిలీప్‌రెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. అతడిది నిరుపేద కుటుంబం కావడంతో ఆదుకోవడానికి మోత్కూరు రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సోమవారం మృతుడి కుటుంబానికి రూ.41,600 అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లింగాల జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను అరిగోస పెడుతున్న ప్రభుత్వం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డి

మోటకొండూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను అరిగోస పెడుతుందని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులపట్ల సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని అన్నం పెట్టే రైతు కంచంలో మట్టిపోసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడక ముందు పడిన కష్టాలు మళ్లీ పడుతున్నారని ఆరోపించారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 7వేలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడు పంటలకు ఎగ్గొట్టి నాలుగో పంటకు నెల రోజుల అలస్యంగా ఇచ్చారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 60శాతం మంది రైతులకు మాత్రమే రైతు భరోసా అందిందని మిగిలిన రైతులకు అందలేదని ఆరోపించారు. రైతులు ఎరువుల కోసం రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నారని ఆరోపించారు. అనంతరం ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రంలోని ఊర చెరువు నిండి మత్తడి పోస్తుండడంతో మత్తడి వద్ద గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీపీ పన్నాల అంజిరెడ్డి, భూ మండ్ల అయిలయ్య, మాజీ కో అప్షన్ సభ్యుడు ఎండి బురాన్, మాజీ ఉప సర్పంచ్ బొట్ల నర్సింహ్మా, సిరబోయిన నర్సింగ్ యాదవ్, సధీర్, గౌరయ్య, జివిలికపల్లి వెంకటేష్, బొట్ల పాండు, నల్ల జహంగీర్, సురేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

● ఆత్మకూరు(ఎం) : మండలంలోని సింగారం గ్రామానికి చెందిన కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు కొప్పుల హరిదీప్‌రెడ్డి నానమ్మ రమరణమ్మ సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి వేర్వేరుగా వెళ్లి రమణమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. హరిదీప్‌రెడ్డిని పరామర్శించి, సంతాపం తెలిపారు.

భగవంతుడిని కొలిస్తే కష్టాలు తొలగుతాయి


రమణేశ్వరంలో హోమ పూజలు చేస్తున్న రమణానంద మహర్షి

భువనగిరి రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): భగవంతుడిని నిష్ఠతో కొలిస్తే కష్టాలు తొలుగుతాయని సిద్దగురు రమణానంద మహర్షి ఉద్బోదించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి శివారులో గల శివశక్తి షిర్డీసాయి అనుగ్రహ పీఠం రమణేశ్వరంలో సోమవారం శతరుద్ర శివలింగాల ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ఆయన భక్తులనుద్దేశించి పలు ప్రవచనలు చేశారు. బంగారం, వెండి, పంచలోహ, రాగి, అష్టలోహ, ఇనుము, సీసంతో తయారు చేసిన శివలింగాలను ప్రతిష్ఠించడం వల్ల భక్తులకు దీర్ఘఆయుష్, అష్టైశ్వర్యాలు కలగడంతో పాటు శుభాలు కలుగుతాయన్నారు. శివలింగాలు ప్రతిష్ఠాపన చేసిన రమణేశ్వరంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రుద్రహవనం చేపట్టి భక్తులకు విశేష అన్నదానం నిర్వహించారు.

సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మందికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారుల కుటుంబాలకు చౌటుప్పల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మునుగోడు అసెంబ్లీ కో-ఆర్డినేటర్ పబ్బు రాజు గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్ర సేనారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుర్వి నర్సింహ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ చెన్నగోని అంజయ్య, మాజీ వైస్ ఎంపీపీలు బొంగు జంగయ్య, బత్తుల విప్లవ్ కుమార్, ఏఎంసీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

మోత్కూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకుడు గుగ్గిల్ల ఎల్లయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని ఆ పార్టీజిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన వర్ధంతి సందర్భంగా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని బుజిలాపురంలో స్మారక స్థూపంపై జెండా ఎల్లయ్య ఎగురవేసి, ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చేడె చంద్రయ్య, నాయకులు చాపల అంజయ్య పాల్గొన్నారు.

ఎత్తిపోతల సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

సంస్థాన్ నారాయణపురం ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 22న నిర్వహించే రాచకొండ ఎత్తిపోతల పథక సాధన సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కరపత్రం ఆవిష్కరించారు.ఈ ప్రాంత రైతాంగానికి సాగు నీరందించేందుకు నిర్మిస్తున్న చర్లగూడెం ప్రాజెక్టుతో పాటు రాచకొండలో ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 22న జరిగే సదస్సుకు రైతులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో గుంటోజు శ్రీనివాసాచారి, దోనూరు నర్సిరెడ్డి, దోడ యాదిరెడ్డి, మల్లెపల్లి లలిత పాల్గొన్నారు.

దంచి కొట్టిన వాన

● జిల్లా వ్యాప్తంగా నీట మునిగిన పంటలు ● పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు


మోత్కూరు మండలం ధర్మారంలో నీట మునిగిన పత్తి

మోత్కూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమ్యాయి. మోత్కూరు మండలంలో కురిసిన భారీ వర్షానికి రైతాంగం అతలాకుతలమైంది. బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. మోత్కూరు పెద్ద చెరువు నిండి బృందావన్ కాల్వకు రైతు నర్సిరెడ్డి బావి సమీపంలో కాల్వకట్టపై నుంచి పొర్లుతుండటంతో ఆ రైతు అందించిన సమాచారం మేరకు నీటి పారుదలశాఖ ఏఈ అఖిల్ తన సిబ్బందిని పంపించి కాల్వకు అడ్డుపెట్టిన జాలీలు, కల్వర్టు వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగింపజేయడం కాల్వకు గండి పడే ప్రమాదం తప్పింది. మోత్కూరు చెరువు నిండి బృందావన్ కాల్వద్వారా నీరు కింది కుంటల్లోకి వెళుతున్నది. మోత్కూరు ఉత్తరాధి చెరువు నిండి అలుగు పోస్తుండటంతో ఆ అలుగు నీరు వరి నాట్ల మీదుగా వెళ్తుండటంతో సుమారు 50 ఎకరాల వరి నాటు నీట మునిగింది. మోత్కూరు అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం), గుండాల మండలాల్లో చాల చోట్ల పత్తి, కది చేలు నీట మునిగాయి. ధర్మారం చెరువు నిండి అలుగు పోస్తుండటంతో సుమారు 30 ఎకరాల వరి పంట నీట మునిగింది. మోత్కూరు, కొండగడపలో గ్రామాల్లో వెళ్లే వీధి జలమయమైంది. మోత్కూరు పలు చోట్ల ఇళ్లలోకి నీరువెళ్లి ఇబ్బంది పడ్డారు. మోత్కూరులో 11 కేవీ విద్యుత్ లైన్‌లో స్తంభం, ఎల్‌టీ లైన్‌లో రెండు స్తంభాలు విరిగాయని ఏఈ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

పరవళ్లు తొక్కుతున్న చిన్నేటి వాగు..

బీబీనగర్ : మండలంలోని చిన్నేటి వాగు ఉగ్ర రూపం దాల్చింది. సోమవారం ఉదయం 11గంటల సమయంలో బీబీనగర్-గూడూరు మధ్య హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై నిర్మించినలో లెవల్ కల్వర్టులకు చేరింది. గంట గంటకు ప్రవాహం పెరుగుతూ మధ్యాహ్నం 2 గంటల సమయానికి ఉధృతి పెరిగి కల్వర్టులపై 5 అడుగుల ఎత్తులో నీటి ప్రవాహం చేరింది. దీంతో జాతీయ రహదారి సర్వీస్ రోడ్లకు ఇరువైపులా చిన్నేటి వాగు ప్రవాహ మార్గాలు గూడూరు, అన్నంపట్ల, రావిపహాడ్ అనాజీపురం, ముగ్దుంపల్లి మార్గాల్లోని లో లెవల్ బ్రిడ్జిపై నుంచి వాగు ప్రవహిస్తుండడం తో రాకపోకలు నిలిపివేశారు. రోడ్డుకు అడ్డంగా ముళ్లకంచలు, భారీ కేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేశారు. మండలంలోని వడపర్తి చెరువు నిండుకుని అలుగు పోస్తుండగా అక్కడి నుంచి దిగువనున్న బీబీనగర్ మండలం జైనపల్లి చెరువుకు పెద్ద ఎత్తున వస్తుండడంతో జైనపల్లి చెరువు కూడా సోమవారం పూర్తిగా నిండుకుని అలుగు పోయడం మొదలైంది. బీబీనగర్ చెరువులోకి నీరు వచ్చి చేరుతోంది. రాయరావుపేట, జమీలాపేట, జియాపల్లి, నెమురగొముల గ్రా మాల్లో ఊర చెరువులు జలకళసంతరించుకున్నాయి.


భువనగిరి మండలం అనాజీపురం - రావిపహాడ్ వాగు మధ్యలో ఏర్పాటు చేసిన బారీ కేడ్లు

● గుండాల : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో సీతారాంపురం, బ్రాహ్మణపల్లి, మాసాన్‌పల్లి, గుండాల చెరువులు, కుంటలు నిండి అలుగుపోస్తున్నాయి. పలు పంటలు మునిగిపోయాయి.

● ఆత్మకూరు(ఎం) : మండలంలోని బిక్కేరు వాగు, చెక్‌డ్యామ్ అలుగుపోస్తున్నాయి. చెరువులను నింపుతూ గంగమ్మతల్లి గలగలా పారింది. ఆత్మకూరు, కొరటికల్, పోతిరెడ్డిపల్లి, టి.రేపాక బ్రిడ్జిలపై నుంచి వర్షపు నీరు ప్రవహించింది. దీంతో పలుగ్రామాల మధ్య రాకపోకలను నిలిపివేస్తూ అధికారులు వాగుల వద్ద అడ్డంగా బోర్డులు ఏర్పాటు చేశారు. ఆత్మకూరు వీర్ల చెరువు మత్తడి పోయగా, బిక్కేరు వాగులో నిర్మించిన చెక్‌డ్యామ్‌లు నిండు కుండలా రిజర్వాయర్లను తలపించాయి.

● బొమ్మలరామారం : మండలంలోని చెరువులు, కుంటలు నిండా నీరు చేరాయి. మండలంలోని బండకాడిపల్లి, జలాల్‌పూర్, కాజీపేట, మల్యాల, హాజీపూర్, మేడిపల్లి, ఫక్కీర్‌గూడెం గ్రామాల మీదుగా ఉన్న శామీర్‌పేట వాగు రాత్రి నుంచి ఉధృతంగా పారుతున్నది. బండకాడిపల్లి, సోమాజీపల్లి, గ్రామాల మధ్యలో ఉన్న వాగు ఉధృతంగా పారడంతో ఇరు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ఆర్డీవో

భువనగిరి రూరల్ : మండలంలో లో లెవల్ కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో కృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని అనాజీపురం, రావిపహాడ్ గ్రామాల మధ్య చిన్నేటి వాగు పై నుంచి వరద నీరు సోమవారం ఆయన తహసీల్దార్ ఎస్ అంజిరెడ్డితో కలిసి పరిశీలించారు. పొంగిపొర్లడంతో పలు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వెంటనే వాగుకు ఇరువైపుల భారీకేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలు కొనసాగించవద్దని హెచ్చరించారు. కాగా ఎగువ ప్రాంతాల నుంచి కురుస్తున్న వరుస వర్షాలు, వరదలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా అధికారులు ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ సైదా సాహెబ్, కార్యదర్శి స్వాతి ఉన్నారు. అలాగే మండలం లోని వీరవెల్లి, చీమలకొండూరు, ముస్త్యాలపల్లి, చందుపట్ల గ్రామాల్లో పత్తి చేనులోకి వర్షం నీరు చేరింది.

● అడ్డగూడూరు :మండలంలోని వేల్దేవి- చౌల్ల గూడెం మధ్య ఉన్న వాగును ఎస్.ఐ వెంకట్ రెడ్డి పరిశీలించారు. వరద ప్రహహం పెరిగినప్పుడు ప్రజలు వాగును దాటవద్దని సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు అలుగుపోస్తున్నాయి. వాగులు ఉధృతంగా వరద వస్తున్నాయి.

●మోటకొండూరు :మండలంలోని పలు చెరువులు, కుంటలు నిండి మత్తడి పోస్తున్నాయి. సికిందర్ నగర్, కాటేపల్లి మధ్య బిక్కేరు వాగు ఉధృతంగా ప్రహించడంతో రెండు గ్రామాల మధ్య సాయంత్రం వరకు రాకపోకలు నిలిచి పోయాయి. పోలీసులు ముందస్తుగా వాగుల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని ఊర చెరువు నిండి మత్తడి పోస్తుండడంతో మాజీ సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత ఆధ్వర్యంలో బోనాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మర్మములసదాశివుడు, సిరబోయినమల్లేష్ యాదవ్, బొలగాని సత్యనారాయణ, ఎగ్గిడి వెంకటయ్య, వంగపల్లి మహేందర్, కొల్లూరి మొగులయ్య, వంగపల్లి ఉప్పలయ్య, బొట్ల శ్రీనివాస్, కొల్లూరి హరిబాబు, గౌతంరాజు, జంపాల నాగచందర్ పాల్గొన్నారు.


మోటకొండూరులో గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న మాజీ సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత, గ్రామస్థులు

వడపర్తి కత్వ వద్ద నీటిని విడుదల

భువనగిరి రూరల్ : ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో భువనగిరి మండలం వడపర్తి కత్వ వద్ద నీరు పొంగిపొర్లుతుంది. సోమవారం ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి వడపర్తి కత్వ వద్ద తూమ్ ద్వారా నీటిని విడుదల చేసి పూజలు చేశారు. శామీర్‌పేట చెరువు నుంచి వడపర్తి కత్వలోకి భారీ వర్షం నీరు వచ్చి చేరుతుండడంతో వడపర్తి కత్వ వద్ద తూమును విడుదల చేయడంతో ఆ నీరు వడపర్తి, హన్మాపురం, అనంతారం గ్రామాల మీదుగా రాచకాల్వలోకి రావడంతో భువనగిరి పెద్ద చెరువులో వరద నీరు చేరుతుందన్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ కుర్షిద్ , డీఈ లావణ్య, నాయకులు తంగెళ్లపల్లి రవికుమార్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కూర వెంకటేశ్, గుర్రా ల శ్రీనివాస్, ప్రవీణ్, బాలరాజు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్లను విమర్శిస్తే ఊరుకునేది లేదు


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్

సంస్థాన్ నారాయణపురం ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : పదవి లేకున్నా నిరంతరం ప్రజల్లో ఉండే వ్యక్తి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకరెడ్డిని కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ మండల కన్వీనర్ నర్రి నర్సింహ అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో తెలియని నాయకుడు రాజగోపాల్‌రెడ్డి అని విమర్శించారు. బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించి వెన్ను పోటు పొడిచి వెళ్లిన నాయకులు మీ వంచన చేరి అవాకులు చవాకులు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిది మన నియోజకవర్గం కాదని కనీసం నియోజకవర్గంలోని గ్రామాలు తెలువదని ఎద్దేవా చేశారు. అతనికి సొంత నియోజకవర్గం కాని మునుగోడుపై సవతి తల్లి ప్రేమే ఉంటుందని పేర్కొన్నారు. 75 శాతం పూర్తయిన చర్లగూడెం ప్రాజెక్టును 25 శాతం పూర్తి చేయలేని అసమర్థత నాయకుడు రాజగోపాల్‌రెడ్డి అని విమర్శించారు. రాజగోపాల్‌రెడ్డి మెప్పుకోసం పదవుల కోసం తమ స్థాయికి మించి మాట్లాడడం సరికాదని ఎమ్మెల్యే అరుచరులపై విమర్శ చేశారు. మంత్రి పదవిపై ఉన్న సోయి అభివృద్ధిపై లేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు శివరాత్రి విద్యాసాగర్, జక్కిడి ధన్వంతరెడ్డి, శంకరాచారి, చిలువేరు బిక్షం, నలపరాజు రమేష్, పానుగోతు పాండురంగా, రాచకొండ గిరి, బోయ శ్రీరాములు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేస్తా


కృష్ణను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఆలేరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : బీజేపీని జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆపార్టీ కార్యదర్శి కామిటికారి కృష్ణ అన్నారు. జిల్లా కార్యదర్శిగా నియమితులైన కృష్ణను పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు పలువురు సోమవారం పార్టీ కార్యాలయంలో సత్కరించిన సందర్భంగా మాట్లాడారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలుచుకునేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మండల నాయకులు తునికి దశరథ, కల్లెం రాజు, బందెల సుభాష్, ఎలగందుల సురేష్, వడ్డెమాన్ నరేందర్, సృజన్ కుమార్, ఎలుగల వెంకటేష్, చింతకింది వెంకటేష్, సిద్దలు, పలువురు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సిమెంట్ అందజేత


కొల్లూరులో సిమెంట్‌ను అందజేస్తున్న ఉపేందర్‌రెడ్డి

ఆలేరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనా మండలంలో కొందరు పేదలు ఇళ్లు కట్టుకోలేకపోతున్నారు. దీంతో మండలంలోని కొల్లూరు గ్రామానికి చెందిన పీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి వారికి సాయం చేయడానికి ముందుకు వచ్చారు. సోమవారం కొల్లూరులో 18 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 10 బస్తాల చొప్పున సిమెంట్ బస్తాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ గాజుల లావణ్య వెంకటేష్, మాజీ సర్పంచ్ పిల్లలమర్రి శంకరయ్య, నర్సయ్య, జనగాం శ్రీపాల్‌రెడ్డి ఉన్నారు.

రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేపట్టాలి

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వర్షాలకు రోడ్లపై పడిన గుంతలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూదాన్ పోచంపల్లిలో సోమవారం సీపీఎం పోచంపల్లి పట్టణ, మండల బీబీనగర్ మండలాల సభ్యులకు రాజకీయ శిక్షణా తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షాలతో పెద్ద ఎత్తున రోడ్లు ధ్వసమయ్యాయని రోడ్లు మొతంం దెబ్బతిని గుంతలు ఏర్పడి ప్రయాణికులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముందుగా పార్టీ జెండాను మండల కార్యదర్శివర్గ సభ్యురాలు అందెల జ్యోతి ఆవిష్కరించారు. కార్యక్రమానికి కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గూడూరు అంజిరెడ్డి, పోచంపల్లి కోట రామ చంద్రారెడి పాల్గొన్నారు.

● మోత్కూరు : మోత్కూరులో నిర్వహిస్తున్న మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు (ఎం), గుండాల మండలాల ప్రాంతీయ రాజకీయ శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభమయ్యాయి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాటూరి బాలరాజు మాట్లాడుతూ దేశంలో కేంద్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటి సభ్యులు బొల్లు యాదగిరి, రాచకొండ రాములమ్మ, మద్దెపురం రాజు, మోత్కూరు, ఆత్మకూరు మండల కార్యదర్శులు గుండు వెంకటనర్సు వేముల బిక్షం, నాయకులు పైళ్ల యాదిరెడ్డి, కందుకూరి నర్సింహ, పిట్టల చంద్రయ్య, మెతుకు అంజయ్య, యాదయ్య పాల్గొన్నారు.

● ఆలేరు : ఆలేరు పట్టణంలోని కాటమయ్య నగర్‌లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మాణాలు చేపట్టకపోవడంతో కాలనీ ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎంఏఎక్బాల్, మొరిగాడి రమేష్ అన్నారు. పార్టీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం కాటమయ్య నగర్‌లో సీపీఎం నాయకులు పర్యటించి సమస్యలపై సమీక్షించి మాట్లాడారు. కార్యక్రమంలో వడ్డెమాన్ బాల్‌రాజు, ప్రసాద్, సలీమ్, సిద్దులు, శ్రీను, రఘురాములు, భాగ్య, రాకేష్, పుష్పమ్మ పలువురు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న జీవితం స్ఫూర్తి దాయకం


భువనగిరిలో పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : బహుజనుల సామ్రాజ్యాన్ని స్థాపించిన గొప్ప పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని జిల్లాలోని మండలాల్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని మండలాల్లో ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భువనగిరి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి వేర్వేరుగా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. అలాగే బీజేపీ, కాంగ్రెస్, ప్రజా సంఘాల నాయకులు వేర్వేరుగా నిర్వహించారు. భువనగిరిలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ, మాజీ ఎంపీ హనుమంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పంజాల జైహింద్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్‌గౌడ్, దుర్గాపతి లక్ష్మీనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు. భువనగిరి మండలంలోని తాజ్‌పూర్‌ర్యాకల శ్రీనివాస్ పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, మోటకొండూరు, వలిగొండ, రామన్నపేట, గుండాల మండలంలోని సుద్దాల, మండల కేంద్రంగౌడ సంఘం ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండలం ఎల్లగిరిలో కంఠమహేశ్వర గౌడ సంఘం ఆధ్వర్యంలో, అడ్డగూడూరు, మో త్కూరు ఎంపీడీవో కార్యాలయాలు, యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయాల్లో పాపన్న గౌడ్‌ను జయంతిని నిర్వహించారు. ఆయా కార్యాలయాల్లో అధికారులు సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ, సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

కొత్త వారికీ రేషన్

(5వపేజీ తరువాయి)

సంచులు ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సూచిస్తూ అభయహస్తం చక్రం, మధ్యలో ఇందిరమ్మ బొమ్మ ముద్రించి పైభాగంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, పౌరసరఫరాలశాఖ మంత్రి ఫొటోలతో తెల్లరంగు బ్యాగులను తయారు చేయించింది. ఇప్పటికే వీటిని అధికారులు ఎంఎల్ఎస్ పాయింట్లకు చేర్చినట్టు సమాచారం. ఇక నుంచి లబ్ధిదారులు ఈ సంచుల్లోనే సరుకులు తీసుకెళ్లాల్సి ఉంటుంది. సెప్టెంబరు 1వ తేదీ నుంచి రేషన్ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేయనుండగా, లబ్ధిదారులకు డీలర్లు ముందుగా ప్రభుత్వం పంపిణీ చేసిన బ్యాగులను అందజేస్తారు. అందుకు తొలుత రేషన్‌కార్డు ఆధారంగా వేలిముద్రను పీవోఎస్ యంత్రం ద్వారా పోల్చుకుని సంచులు ఇస్తారు. తిరిగి కార్డు నెంబరు ఆధారంగా మరోసారి వేలిముద్ర తీసుకుని బియ్యం తూకం వేసి ఇస్తారు.

అర్హులందరికీ రేషన్‌బియ్యం



జిల్లాలోని అర్హులైన రేషన్‌కార్డుదారులందరికీ ఉచితంగా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. సెప్టెంబరు నుంచి లబ్ధిదారులకు బియ్యాన్ని పంపిణీ చేయనున్నాం. ప్రతీ కుటుంబానికి, కొత్తగా రేషన్‌కార్డుల్లో చేరిన వారికి కూడా బియ్యం పంపిణీ చేయనున్నాం. జిల్లాలో మొత్తం 24,431 నూతనంగా రేషన్‌కార్డులు జారీ చేశాం. ప్రస్తుతం యూనిట్ల సంఖ్య 1,02,805కు చేరింది. పాత వారితో నూతనంగా సభ్యులుగా నమోదైన వారికి కూడా బియ్యం పంపిణీ చేస్తాం.

-రోజారమణి, పౌరసరఫరాశాఖ జిల్లా అధికారి

భారీ వర్షంతో అతలాకుతలం

(5వ పేజీ తరువాయి)

సెం.మీ, మోత్కూరులో 11.86సెం.మీ, బొమ్మలరామారం మండలంలో 11.64సెం.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో ప్రజలు అతలాకుతలమయ్యారు. హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాల్లో కురుస్తోన్న వర్షాలకు మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. బీబీనగర్ మండలంలో మూసీతోపాటు పలు కత్వాలు నిండి పంట పొలాల్లోకి వరద చేరింది. పలు గ్రామాలకు రాకపోకలను అధికారులు నిలిపివేశారు. బీబీనగర్‌లో వరి పొలాల్లోకి వరద చేరింది. భువనగిరి మండలంలోని వీరవెల్లి, తదితర గ్రామాల్లో పత్తి చేలల్లో మొక్కలు మునిగిపోయాయి. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించడంతో యంత్రాంగం అప్రమత్తమైంది. మూసీ వరద పెరిగే అవకాశం ఉన్నందున రెవెన్యూ, పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. సంగెం-బొల్లెపల్లి, రుద్రవల్లి-జూలూరు లోలెవల్ బ్రిడ్జీల పైనుంచి నాలుగు అడుగుల ఎత్తులో మూసీ పరవళ్లు తొక్కుతోంది. తుర్కపల్లి, మోటకొండూరు, తదితర మండలాల్లో భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం) మండలాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మోత్కూరులో ఉత్తరాది చెరువు నిండి అలుగు పోస్తుండటంలో 50 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. అడ్డగూడూరు మండలం ధర్మారం చెరువు నిండి అలుగుపోస్తుండటంతో 30 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. గుండాల మండలం కేంద్రంలో కొత్తకుంటకు గండిపడింది. మోత్కూరు బృందావన్ కాల్వకు గండి పడే ప్రమాదం పొంచి ఉండటంతో అధికారులు కాల్వకు అడ్డుగా ఉన్న జాలీలు, కల్వర్టు వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగించి గండి పడకుండా చేశారు.